క్లుప్తంగా

10న అరుణాచలంకు సూపర్ లగ్జరీ బస్సు

వినుకొండ(నూజెండ్ల): అరుణాచలం దర్శనం కోసం ఫిబ్రవరి 10వ తేదీన వినుకొండ నుంచి సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేసినట్లు డీఎం నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం రాత్రి 8 గంటలకు బయలుదేరి 11వ తేదీ మంగళవారం ఉదయం తిరుత్తణి శ్రీ కుమార స్వామి దర్శనం చేసుకొని 12 గంటలకు శివకంచి, విష్ణుకంచి దర్శనం, రాత్రి 8 గంటలకు అరుణాచలం దర్శనం, గిరి ప్రదక్షిణ చేసుకొని ఫిబ్రవరి 12వ తేదీ బుధవారం ఉదయం 9గంటలకు బయలుదేరి గోల్డెన్ టెంపుల్, కాణిపాకం వినాయకుని దర్శించుకుని తిరిగి ఫిబ్రవరి 13వ తేదీ గురువారం ఉదయం నాలుగు గంటలకు వినుకొండ చేరుకుంటుందని వివరించారు. టిక్కెట్ ధర రూ.2550 ఉంటుందని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని తెలిపారు.

7న ఉచిత సామూహిక వ్రతాలు



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని శ్రీనివాస్ నగర్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7 ఉదయం 10గంటలకు అద్భుత ఫలితాలను ఇచ్చే శ్రీ వెంకటేశ్వరస్వామి వ్రతాలను సామూహికంగా భక్తులకు ఉచితంగా జరపనున్నట్లు వీహెచ్‌పీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. దీనికి సంబంధించి కరపత్రాలను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో భాగవతుల రవికుమార్, అర్చకులు శ్రీనివాసులు శ్రావణ్‌కుమార్, ఆలయ కమిటీ అధ్యక్షులు రెడ్డి బంగారయ్య, గజవల్లి నాగపవన్‌కుమార్, గాలి శ్రీనివాసరావు, తెలగంశెట్టి పావని, రామకోటేశ్వరరావు, జి.మాధవరావు, గుడిపాటి కోటేశ్వరరావు, అచ్యుత కృష్ణసుబ్బారావు, నరేంద్ర వాసు, అనసూయ పాల్గొన్నారు.

ఇంటి స్థలం సర్వే చేయించండి



తెనాలిఅర్బన్: 29వ వార్డులో ఉన్న తన ఇంటి స్థలాన్ని సర్వే చేయాలని ఆ ప్రాంతానికి చెందిన ఎస్.నాగేశ్వరరావు మున్సిపల్ మేనేజర్ దేవసేనకు అర్జీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. టౌన్ ప్లానింగ్ అధికారులకు అర్జీని పంపి త్వరగా సర్వే చేయించే విధంగా చూస్తామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్స్ అధ్యక్షుడిగా అన్నవరపు



శావల్యాపురం: మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో జాతీయ ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్స్ నూతన కార్యవర్గ సభ్యులు ఎంపిక సోమవారం చేపట్టారు. నూతన అధ్యక్షులుగా అన్నవరపు వెంకటేశ్వర్లు (గుంటుపాలెం) కార్యవర్గ సభ్యులు లక్కపోగు పెద గంగయ్య, (శానంపూడి) వేముల మారుతి (వేల్పూరు)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లిఖిత పూర్వకంగా తీర్మానం చేసిన ధ్రువీకరణ పత్రాన్ని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య, ఏపీవో కె.రామారావులకు అందజేశారు.

ఏజీపీకి ఘన సత్కారం



వినుకొండ(నూజెండ్ల): అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులైన ముప్పాళ్ల జ్ఞానేశ్వరరావుని పట్టణంలోని ప్రభుత్వ చీఫ్‌విప్ కార్యాలయంలో ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు ఘనంగా సన్మానించారు. అదేవిధంగా న్యాయవాది నక్కా రమణారావును సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లెనిన్, జనసేన నాయకులు నాగశ్రీనురాయల్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ కాలనీలో బైకు చోరీ

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం గ్రామం వడయరాజులు కాలనీలో అప్పాచీ బైకును గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం చోరీ చేశారు. స్థానికులు వివరాలు మేరకు బీసీ కాలనీకు చెందిన వేముల నాగరాజు రోజు మాదిరిగానే తన బైకు ఇంటి ఎదుట పార్కింగ్ చేశాడు. సోమవారం తెల్లవారుజామున బైకు కనిపించకపోవటంతో చోరీ జరిగినట్లు నిర్ధారణ చేసుకొని స్థానిక పోలీసు స్టేషనులో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. గ్రామానికి చెందిన దూదెకుల షైదాకు చెందిన బైకును తీసుకొని వెళ్లి చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సమీపంలో ఆగంతకులు వదిలివెళ్ళారు. రెండు నెలల క్రితం ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన ఆటో చోరీకి గురైంది. అలాగే గ్రామానికి చెందిన దురిశెల సత్యనారాయణ నివాస గృహంలో చోరీ జరిగింది.

మానవాళికి పాలిథిన్ అనర్థం!

- తెలిసినా ఆగని వినియోగం
- నియంత్రణకు చర్యలు శూన్యం
- పాలిథిన్ కవర్లతో మురుగు పారుదలకూ అడ్డంకులు
- పర్యావరణానికి పెను విఘాతం



పాలిథిన్ కవర్లలో తీసుకెళ్తున్న సరుకులు



పట్టణంలో వెలువడిన వ్యర్థాలలో పాలిథిన్ కవర్లు

చిలకలూరిపేట: పాలిథిన్ కవర్ల వినియోగం పర్యావరణానికి తీవ్ర ముప్పు అని తెలిసినా, పారిశుద్ధ్యానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నా వీటి నియంత్రణ సాధ్యం కావటం లేదు. గతంలో అనేకసార్లు పాలిథిన్ కవర్లను నిషేధిస్తున్నట్లు ప్రకటించటం, అది ఆచరణకు నోచుకోక విఫలం కావడం పరిపాటిగా మారింది.



పాలిథిన్ కవర్లు మేస్తున్న ఆవు

పాలు, పెరుగు, ఉప్పు, పప్పు, చివరకు వేడి వేడి సాంబార్, కర్రీ పాయింట్ల నుంచి కూరలు ఏమైతే నేమి ప్రతీ దానికి పాలిథిన్ కవర్ కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అనేక స్వచ్ఛంద సంస్థలు పాలిథిన్ వినియోగం ఎంతో అనర్థదాయకమని, పర్యావరణానికే కాదు జీవరాశికి ఎంతో హాని చేస్తుందని ప్రచారం నిర్వహిస్తున్నా ఎలాంటి ఉపయోగం ఉండటం లేదు. ఎన్నో అనర్థాలకు కారణమౌతున్న పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలపై చైతన్యం తెచ్చేందుకు ప్రభుత్వాలు, స్థానిక సంస్థలకు చిత్తశుద్ధి లేకపోవడమే దీనికి కారణం. నీరు, నేల కలుషితం కారాదు. భావితరాలకు స్వచ్ఛ సమాజం అందజేద్దామనే నినాదాలు, ప్రచారానికే పరిమితమౌతున్నాయి.


ఎన్ని అనర్థాలో!

ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలవడానికి వెయ్యి సంవత్సరాలు పడుతుందని డబ్ల్యూహెచ్‌వో గణాంకాలు తెలుపుతున్నాయి. ఈ కవర్లను తగులబెడితే దీని నుంచి వెలువడే డయాగ్జాన్స్ వల్ల క్యాన్సర్ వ్యాధి ప్రబలే ప్రమాదం ఉందని వైద్యులు తెలుపుతున్నారు. ఈ పొగ నుంచి వెలువడే రసాయనాలు ఓజోన్ పొరకు హాని చేస్తాయి. గతిలేని పరిస్థితుల్లో కొన్ని చోట్ల వీటిని తగుల బెడుతుండటం ప్రమాదానికి హేతువుగా మారుతున్నది. పట్టణంలో వెలువడే వ్యర్థాలలో అధికభాగం పాలిథిన్ కవర్లే ఉండటంతో అవి కాలువల్లో పడి డ్రెయిన్‌లు పారని పరిస్థితులు నెలకొంటున్నాయి. మార్కెట్‌లో కొనుగోలు చేసిన వస్తువులను పాలిథిన్ కవర్లలో తీసుకెళ్లటం ఫ్యాషన్‌గా మారింది. హోటళ్లు, రెస్టారెంట్లు, కూరగాయల మార్కెట్లు తదితర చోట్ల ప్రతి చిరువ్యాపారి మొదలు హోల్‌సేల్ వ్యాపారుల వరకు పాలిథిన్ కవర్లలో సరుకులు అందించటం పరిపాటైంది. టిఫిన్, భోజనం పార్శిళ్లకు కూడా వీటినే వినియోగిస్తున్నారు. వేడిగా ఉండే ఆహార పదార్థాలను ఈ కవర్లలో ఉంచటం వలన పాలిథిన్‌లోని రసాయనాలు ఆహారంలో కలిసి జీర్ణాశయం, ప్రేగులు, కాలేయం తదితరాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీనికి తోడు అవసరం తీరిన తర్వాత పాలిథిన్ కవర్లను ఎక్కడ పడితే అక్కడ పడవేస్తుండటంతో అవి కాలక్రమంలో నేల క్రింద పొరల్లో చేరి వర్షం కురిసినపుడు భూమిలోకి నీరు ఇంకదు. పాలిథిన్ కవర్లు తినటం వలన పశువులు పేగు క్యాన్సర్‌కు గురిఅవుతాయి. మిగిలి ఉన్న ఆహార పదార్థాలు, కూరగాయల వ్యర్థాలతో నింపి పారవేసిన పాలిథిన్ కవర్లను పశువులు తిని రోగాల బారిన పడి మృతి చెందిన దాఖలాలు అనేకం.

డ్రెయిన్ల పారుదలకు అడ్డంకి

ఎక్కడ చూసినా ఉపయోగించి పడవేసిన పాలిథిన్ కవర్లు మురుగుకాల్వల్లో తేలుతూ దర్శనమిస్తాయి. డ్రెయిన్లలో పూడిక తొలగించినప్పుడు వచ్చే సిల్ట్ కన్నా పాలిథిన్ కవర్లే అధికంగా ఉంటాయి. డ్రెయిన్లలో ఎక్కడికక్కడ అడ్డుపడి మురుగునీరు ప్రవహించకుండా అడ్డుపడుతుంటాయి. దీంతో డ్రెయిన్లు పారని పరిస్థితి ఏర్పడి పరోక్షంగా దోమల వ్యాప్తికి కారణమౌతున్నాయి. అయినప్పటికీ వీటిని నిషేధించాలన్న ధ్యాస పురపాలకులకు కలగదు. ప్రతిసారి పాలిథిన్ కవర్ల నిషేధంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయటం, వ్యాపారులను హెచ్చరించటం ఆ తదుపరి నిషేధాన్ని గాలికి వదలివేయటం పరిపాటిగా మారింది.

నియంత్రణకు చర్యలు



ప్లాస్టిక్ వేస్టు మేనేజ్‌మెంట్ రూల్స్ -2016 ప్రకారం పాలిథిన్ కవర్ల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. 120 మైక్రాన్ల కన్న తక్కువ ఉన్న పాలిథిన్ కవర్లు వినియోగించరాదు. ఇప్పటికే ఈ సమస్యపై అధ్యయనం చేశాం. పాలిథిన్ కవర్లు విక్రయించే వారిని పిలిపించి అవగాహన కల్పిస్తాం. ఆ తదుపరి వీటి నియంత్రణకు అవసరమైన చర్యలన్నీ చేపడతాం.

-పి.శ్రీహరిబాబు, మున్సిపల్ కమిషనర్

ఇంజనీరింగ్ వర్కర్స్ వేతనాలు పెంచాలి



వినుకొండ(నూజెండ్ల): మున్సిపాలిటీ ఇంజనీరింగ్ వర్కర్స్ జనరల్‌బాడీ సమావేశం అధ్యక్షతన శివయ్యభవన్ ఏఐటీయూసీ ఆఫీసులో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ పల్నాడు జిల్లా నాయకులు ఎ.మారుతీ వరప్రసాద్ హాజరయ్యారు. మున్సిపాలిటీలో పని చేస్తున్న ఇంజనీరింగ్ వర్కర్స్ చాలీచాలని జీతాలతో కుటుంబాలు గడవడం ఇబ్బందులుగా ఉందన్నారు. పిల్లల్ని చదివించాలన్నా ఫీజులు కట్టలేని భారాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ఫైనాన్స్‌లో అప్పులు తీసుకొచ్చి వడ్డీలపై వడ్డీలు కడుతూ కుటుంబాల్ని పోషించటం చాలా కష్టంగా మారినటు వంటి పరిస్థితుల్లో సుప్రీం కోర్టు గైడెన్స్ ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అది అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. వెంటనే ప్రభుత్వాలు స్పందించి మున్సిపాలిటీలో పని చేస్తున్నటువంటి ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న వాటర్ వర్కర్స్, కరెంట్ వర్కర్స్, వివిధ రంగాల్లో పని చేస్తున్నటువంటి కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం వెంటనే అమలు చేయాలని లేకపోతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సంద్రపాటి సైదా, బూదాల శ్రీనివాసరావు, ఉలవలపూడి రాము, రాయభారం వందనం, కె.మల్లికార్జునరావు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి పారుదలకు శాశ్వత పరిష్కారం

గణపవరం వద్ద జాతీయరహదారి కాల్వలను పరిశీలించిన కమిషనర్



గణపవరంలో కమిషనర్ శ్రీహరిబాబుతో మాట్లాడుతున్న వైస్‌చైర్మన్ వెంకటేశ్వరరావు

నాదెండ్ల: గణపవరం గ్రామ పరిధిలోని నూతన మార్కెట్ యార్డు నుంచి కుప్పగంజివాగు వరకూ జాతీయరహదారి వెంబడి ఉన్న సైడు కాల్వలను చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు సోమవారం పరిశీలించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మురుగు కాల్వల స్థితిపై మున్సిపల్ వైస్‌చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు తులం సుధాకర్, ఆదంవలి ప్రశ్నించిన సంగతి విదితమే. పెట్రోల్ బంకు వద్ద నుండి కుప్పగంజి వాగు వరకూ గ్రామ పరిధిలో సైడు కాల్వల నీరు, వర్షపు నీరు పొంగి డొంక రోడ్డును ముంచెత్తుతున్నాయని, దీంతో ప్రతి ఏటా రోడ్లు దెబ్బతింటున్నాయని కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. దీంతో కమిషనర్ శ్రీహరిబాబు, డీఈ రహీం, ఏఈ చల్లా శ్రీనివాసరావు, కాంట్రాక్టర్ జానీబాషాతో కలిసి కాలువలు పరిశీలించారు. ఒకవైపు పెట్రోల్‌బంకు వద్ద నుంచి సుమారు 250 మీటర్ల పొడవున నూతనంగా సైడు కాల్వలను ఏర్పాటు చేసి మురుగు నీటిను జాతీయ రహదారి వెంబడి నుండి కుప్పగంజి వాగులో కలిసే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. అయితే దీనిపై కమీషనర్ శ్రీహరిబాబు మాట్లాడుతూ, గతంలో జాతీయ రహదారి వెంబడి ఉన్న సైడు కాల్వల నిర్మాణానికి, కుప్పగంజి వాగు, ఓగేరువాగుల్లో మురుగు కలిసేలా నేషనల్ హైవే అధికారులు రూ.25 కోట్లతో వర్క్ ప్రపోజల్స్ పంపామన్నారు. త్వరలో ఆర్థిక సంఘం నిధులు విడుదలైన వెంటనే సైడు కాల్వలను నిర్మించి శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ నిచ్చారు.

రెడ్డిపేరంటాలమ్మ ఆలయానికి భారీగా విరాళాలు



నాదెండ్ల: సాతులూరు గ్రామంలో రెడ్డిపేరంటాలమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటి వరకూ రూ.2 కోట్లకు పైగా వ్యయం చేశారు. ఈ ఏడాది మార్చి 17వ తేదీన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. గ్రామానికి చెందిన దాతలు ఈదర సాంబశివరావు, నాగ మల్లేశ్వరరావు రూ.4 లక్షలు, నడింపల్లి వెంకటేశ్వరరావు రూ.1.25 లక్షలు, చిట్టిపోతు ద్రాక్షాయమ్మ రూ.1 లక్ష విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలను అభినందించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ వజ్జా వీరాంజనేయులు, నాయకులు బండారుపల్లి సత్యనారాయణ, రామారావు, లక్ష్మీనారాయణ, వెంకట సుబ్బారావు, సీతయ్య, వెంకటరావు, నర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దుస్తుల తయారీపై అవగాహన



నాదెండ్ల: సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు సోమవారం ప్రధానమంత్రి స్కూల్‌ఫర్ రైజింగ్ ఇండియా స్కీం ద్వారా ఇండస్ట్రియల్ టూర్ నిర్వహించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా నరసరావుపేటలో దుస్తుల తయారీ కంపెనీలో కుట్టుమిషన్, ఎంబ్రాయిడరీ డిజైనింగ్‌పై పి.ఎస్తేర్‌రాణి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు దుస్తుల తయారీ విధానాన్ని చూపారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రసాద్, ఒకేషనల్ కోఆర్డినేటర్ ఎం.సుధాకర్ పాల్గొన్నారు.

వ్యాపారవేత్తగా 'రైతు' ఆలోచన మారాలి

- ఐఐపీఎం డైరెక్టర్ ప్రొఫెసర్ జాన్‌మనోరాజ్
- స్పైసెస్‌పార్కులో రైతులు, ఎఫ్‌పీవోలతో శిక్షణ కార్యక్రమం



అవగాహన కల్పిస్తున్న ఐఐపీఎం, స్పైసెస్‌బోర్డు అధికారులు

యడ్లపాడు: తమ ఆలోచనలను వ్యాపారవేత్తలుగా మార్చుకున్నప్పుడే రైతులు మార్కెటింగ్‌లో అధిక ఆదాయాన్ని పొందే వీలుంటుందని ఐఐపీఎం డైరెక్టర్ ప్రొఫెసర్ జాన్‌మనోరాజ్ పేర్కొన్నారు. బెంగుళూరుకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్, భారత సుగంధద్రవ్యాల మండలి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం వర్క్‌షాపును నిర్వహించారు. గుంటూరు స్పైసెస్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ అనస్‌బెబ్బరం అధ్యక్షతన మిర్చిరైతులు పండించే రైతులకు బ్రాండింగ్- మార్కెటింగ్ విధానాలపై ఒకరోజు శిక్షణను ఇచ్చారు. యడ్లపాడు మండలం మైదవోలు, వంకాయలపాడు పంచాయతీల పరిధిలోని స్పైసెస్‌పార్కు వేదికగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాండింగ్‌తో మార్కెటింగ్‌లో మంచి గుర్తింపు వస్తుందని ప్రొఫెసర్ జాన్‌మనోరాజ్ చెప్పారు. మిర్చి పండించే రైతులు కేవలం వాటిని దళారులకు అమ్ముకోవడం మాత్రమే చేస్తున్నారన్నారు. అయితే వాటిని కొనుగోలు చేసిన వ్యాపారులు ప్రాసెసింగ్ చేసుకుని మార్కెట్‌లో మంచి గిరాకీకు విక్రయించుకుంటున్నారన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ నబి రసూల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు ద్వారా బ్రాండింగ్ వ్యూహాలు, వ్యాపార నమూనాలపై చర్చించారు. వినియోగదారు రూపాయిలో తమ వాటాను పెంచుకోవడంలో ఈ కార్యక్రమం చాలా ఉపయోగకరంగా ఉందని శిక్షణకు వచ్చిన తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కార్యక్రమంలో సుమారు 50 మంది మిర్చి రైతులు పాల్గొన్నారు.

పురపాలక ఆర్‌వో శ్రీనివాసరావు అభినందనీయుడు



శ్రీనివాసరావును సత్కరిస్తున్న రామస్వామి, వెంకటేశ్వర్లు

నరసరావుపేట: పురపాలక సంఘంలో రెవెన్యూ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కోమటినేని శ్రీనివాసరావుకు ఉత్తమ సేవా పురస్కారం లభించినందుకు సిరి డెంటల్ ఎండీ డాక్టర్ చొప్పా రామస్వామి, జంజనం వెంకటేశ్వర్లు, దేవళ్ల వెంకటేశ్వరరావు, పలువురు లా విద్యార్థులు సోమవారం అభినందనలు తెలియచేస్తూ సత్కరించారు. ఆదివారం రిపబ్లిక్‌డే ఉత్సవాల్లో జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు చేతుల మీదుగా శ్రీనివాసరావు పురస్కారం స్వీకరించారు. ఉద్యోగ పరంగా చేస్తున్న కృషికి గుర్తింపుగా ఉత్తమ సేవ పురస్కారం లభించిందని కొనియాడారు. తన పదవికి న్యాయం చేస్తూ నిర్విరామంగా పనిచేస్తూ అందరి మన్ననలు పొందారన్నారు. లా కాలేజీ విద్యార్థులు సయ్యద్ చిన్న సైదా, రామక్రిష్ణ చౌదరి, వెంకట రామిరెడ్డి, ఆంజనేయులు, వెంకటపతి రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే మంత్రులను కలుస్తున్నా

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట: తాను నియోజవర్గంలో అభివృద్ధి పనులకోసమే పలుమార్లు మంత్రులను కలుస్తున్నానని, వీటిపై సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను పట్టించుకోనని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్పష్టం చేశారు. సోమవారం గుంటూరురోడ్డులోని పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గంలో డంపింగ్ యార్డు, టిడ్కో, ఆటోనగర్, గృహ నిర్మాణ సమస్యలను సకాలంలో పూర్తి చేసేందుకు మంత్రులను తాను పదేపదే కలుస్తున్నానని చెప్పారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో కొత్తపాలెం గ్రామం నుంచి కోటప్పకొండ వరకు రోడ్ల నిర్మాణం కోసం రూ.4 కోట్ల నిధులను తీసుకురావటం జరిగిందన్నారు. మరికొన్ని నిధులు తీసుకొచ్చేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు.

రహదారి భద్రత అందరి బాధ్యత



ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో పోస్టర్ విడుదల చేస్తున్న కన్వీనర్ రాజానాయక్

నరసరావుపేట: రహదారి భద్రత అందరి బాధ్యతని రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్, పల్నాడు జిల్లా రహదారి భద్రతా కమిటీ కన్వీనర్ ఆర్.రాజానాయక్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసం పురస్కరించుకుని స్థానిక రోడ్లు భావనాల శాఖ కార్యాలయంలో జిల్లా రహదారి భద్రతా కమిటీ తరుపున రోడ్డు భద్రతా సూచనలతో కూడిన పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ ఎన్‌జీవో సభ్యులు ఆర్.బంగారయ్య, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హాజరత్తయ్య పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు కల్వర్టు నిర్మించాలి



నాదెండ్ల: జాతీయరహదారి నుంచి గణపవరం గ్రామంలోని వెళ్లే రోడ్డులో నిర్మితమౌతున్న ముఖద్వారం ముందుభాగంలో కల్వర్టు నిర్మించాలని స్థానికులు పంచాయతీ అధికారులను కోరారు. దీంతో ఆ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు, కార్యదర్శి మారుతీబాబు, కవిత పరిశీలించారు. బెంగుళూరు బేకరి ఎదురుగా కల్వర్టు నిర్మాణం లేకపోవటంతో ప్రమాదభరితంగా మారిందంటూ స్థానికులు వివరించారు. స్లాబ్ వేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరారు. దీనిపై త్వరలో ఉన్నతాధికారులకు నివేదించి పంచాయతీ నిధులతో కల్వర్టు నిర్మాణానికి అనుమతులు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సంతోష్, బాష, శిల్ప, నాయకులు కెల్లంపల్లి అచ్చయ్య, కంచర్ల శ్రీనివాసరావు, కాట్రు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పశు పోషణతో రైతులకు ఆర్థిక లబ్ధి

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట: రైతులకు పశుపోషణతో ఆర్థిక లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పశు సంవర్థకశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాల్లో భాగంగా మండలంలోని మానుకొండవారిపాలెం గ్రామంలో సోమవారం మేలుజాతి లేగదూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ పశువైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరాల్లో పశువైద్యులతో పరీక్షించి ఉచితంగా వైద్యం అందించటంతో పాటు, తేలికపాటి శస్త్ర చికిత్సలు నిర్వహించబడతాయన్నారు. ఎదలో ఉన్న పశువులను గుర్తించి కృత్రిమ గర్భధారణ చేయడం, చూడి పరీక్షలు నిర్వహించి, శాస్త్రీయ సూచనలు అందజేయబడతాయన్నారు. ప్రదర్శనలో 61 లేగదూడలు పాల్గొన్నాయి.

సంకురాత్రిపాడులో ఉచిత పశు ఆరోగ్య శిబిరం

నాదెండ్ల: సంకురాత్రిపాడు గ్రామంలో సోమవారం ఉచిత పశుఆరోగ్య శిబిరం నిర్వహించారు. సాతులూరు పశువైద్యాధికారి శ్రీలక్ష్మీ పాల్గొని 69 పశువులకు, 92 దూడలకు, 470 జీవాలకు నట్టల నివారణ టీకాలు వేశారు. 42 గేదెలకు, ఆవులకు చూడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. సంపూర్ణ మిశ్రమదాణా పంపిణీ చేశారు. 32 ఎదకురాని గేదెలకు ఉచితంగా మందులు అందించారు. ఆరు పశువులకు కృత్రిమ గర్భధారణ చేశారు. 86 గేదెలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. శిబిరాన్ని 124 మంది పశుపోషకులు సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వసతి గృహ సంక్షేమ అధికారిణికి సేవా పురస్కారం



వినుకొండ(నూజెండ్ల): 76వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను పట్టణంలోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహ సంక్షేమ అధికారిణి పగడాల రత్నకుమారికి ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఈ మేరకు నరసరావు పేటలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు చేతులమీదుగా ఆమె పురస్కారాన్ని అందుకున్నారు. పురస్కారం అందుకున్న రత్నకుమారిని పలువురు అభినందించారు.

ప్రమాదంలో వ్యవసాయ కూలి మృతి



మృతురాలు కళ్లం పద్మ (పాత చిత్రం)

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో మహిళ వ్యవసాయ కూలి మృతి చెందింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతగుడిపాడు గ్రామానికి చెందిన కళ్లం పద్మ (52) వ్యవసాయ కూలి. ఆమె పొలంలో పనులు ముగించుకొని ట్రాక్టర్‌పై వస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పై నుండి క్రింద పడింది. తీవ్ర గాయాలైన పద్మను నరసరావుపేట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలు భర్త వెంకటేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.